


బొలారంనుంచి సికింద్రాబాద్‌కు వచ్చిన లోకల్ ట్రెయిన్ రద్దీగా వుంది. కూర్చునేందుకే కాదు. నించునేందుకుకూడా చోటులేదు.

"ఛీ. ఛీ. హైద్రాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఎప్పుడు బాగుపడుతుందో'' అన్నాడు స్వామినాధం చిరాకుగా.

నేను నవ్వి వూరుకున్నాను. ఎప్పుడూ తెల్ల బట్టలే వేసుకునే స్వామినాధం ఆ రోజుఅప్పుడే మడతవిప్పిన తెల్లబట్టలు తొడుక్కున్నాడు. నలిగిపోతున్నాయి అవి.

"మొహంమీద నీళ్ళు చల్లండి"

—"పక్కకి తప్పుకోండి. గాలి ఆడ నివ్వండి."

—"ఫిట్ అది. నీళ్ళు తాగించాలి." ఆక స్మాత్తుగా రకరకాల మాటలు వినబడ్డాయి కంగారుగా. అటు చూసాం కాని ఏమీ కనబడ లేదు.

"ఏమిటి?" అడిగాడు స్వామినాధం తన పక్కన నించుని వున్న వ్యక్తిని.

తనకు తెలియదన్నట్లుగా తల అడ్డంగా

వూపాడతను.

"ఎవరికో హిస్టీరియా వచ్చినట్లుంది" ఇంకో వ్యక్తి చెప్పాడు స్వామినాథన్‌కి.

రైలు సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది కొన్ని క్షణాల్లో. అంతదాకా జైల్లో వుండి విడుదల లభించిన ఖైదీల్లాగా ఒక్కసారిగా ప్రయాణీకులంతా కంపార్ట్‌మెంట్ లోంచి బయటపడసాగారు గబగబా.

"పద" అన్నాను రైలు దిగి.

స్వామినాథం దిగలేదు. నిముషంలో కంపార్ట్‌మెంట్ ఖాళీ అయిపోయింది. అయినా లోపల ఏదో చేస్తున్నాడు. నాకు చిరాకేసింది. మా బస్సు బయలుదేరే టైం అయింది.

"త్వరగా వెళ్ళకపోతే బస్సులోకూడా సీట్ దొరకదు"అంటూ నేను మళ్ళీలోపలికివెళ్ళాను.

స్వామినాథం ఓ ఖాళీ సీట్‌మీద కూర్చుని వున్నాడు. అతని ప్రక్కన ఓ నలభై అయిదేళ్ళ వ్యక్తి సీటుకి చేరగిలబడి కూర్చుని వున్నాడు. అతని కళ్ళు మూసుకుని వున్నాయి. గుప్పిళ్లు బిగించి వున్నాయి. నోట్లో నుంచి సన్నగా నురగ వస్తోంది.

స్వామినాథం నా వంక చూసాడు కొన్ని క్షణాలు. తర్వాత అతని కుడిచేతి గుప్పెటని బలవంతంగా తెరచి ఆ అరచేతిలో ఇనప తాళం చెవి ఒకటి వుంచాడు. నేను అవాక్కయిపోయి అలాగే చూస్తూ నిల్చున్నాను.

ఎంత సేపయిందో తెలియలేదు. దాదాపు అయిదు నిముషాల తర్వాతనుకుంటాను మూర్ఛ వచ్చిన అతను తేరుకున్నాడు. ఎంతో నిస్త్రాణగా వుంది అతనికి.

అప్పటికే స్వామినాథం తన జేబురుమాలతో అతని నోటిని శుభ్రంగా తుడిచాడు. అతను కళ్ళు విప్పి నీరసంగా చూసాడు స్వామినాథం వంక.

"ఇప్పుడు ఫర్వాలేదా?" అడిగాడు స్వామినాథం.

అతను తల వూపాడు.

"లేచి నడవగలరా?"

మళ్ళీ తలవూపి లేచాడు.

స్వామినాథం అతని కుడిచేతిలో వుంచిన తన తాళం చెవిని తీసుకున్నాడు. రుమాల కిటికీలోంచి బయటకి పారేసి తనూ లేచాడు.

"థాంక్స్" అన్నాడతను రెండు చేతులూ జోడించి

ఆ నమస్కారం చేసిన విధంలోనే అతని స్వామినాథంమీద ఏర్పడ్డ కృతజ్ఞతా భావం కనపడింది అధికంగా.

"సార్. మీ టైం పాడుచేసాను" అన్నాడతను.

నా చేతి గడియారం వంక చూసుకున్నాను అప్పుడు.

ఆఫీసు కెళ్ళే మా బస్సు అప్పటికే వెళ్ళిపోయి వుంటుందనుకున్నాను.

ముగ్గురం ప్లాట్‌ఫారం మీదకు వచ్చాం. అతను నీళ్ళపంపువైపు వెళ్ళాడు మొహం కడుక్కోడానికి. మేం ఇద్దరం బయటకి నడిచాం స్వామినాథం చేతులు కడుక్కున్నాక.

"బస్సు వెళ్ళిపోయింది" అన్నాడు స్వామినాథం ఖాళీ బస్‌స్టాప్‌ని చూసి.

"ఇవాళ ఆఫీసుకు అరగంట లేటు."

ఆ తర్వాత మేం మౌనంగా వుండిపోయాం. ఆఫీస్‌కు చేరుకున్నాక ఆఫీసర్ గదిలోకి వెళ్ళాం అటెండెన్స్ రిజిష్టర్ అప్పటికే ఆయన గదిలోకి వెళ్ళటంవల్ల.

మేం సంతకాలు చేసాక అడిగాడు కోపంతో కూడిన అధికారంతో.

"ఆలస్య మయిందేం?"

జరిగింది చెప్పాడు స్వామినాథం.

"ఇంకోసారి ఇలా లేటయితే నేను వూరుకోను. హెడ్ ఆఫీస్‌కి రిపోర్ట్ చేయాల్సి వుంటుంది. అయినా ఆయన మీకు బంధువా స్నేహితుడా?" కోపంగా కసిరాడు.

మారు మాట్లాడకుండా బయటకి వచ్చాం ఇద్దరం.

"సారీ గురూ. నావల్ల నీకుకూడా మాటొచ్చింది''అన్నాడు స్వామినాథం కొద్దిగా బాధగా.

"ఇట్సాల్‌రైట్" అన్నాను.

మర్నాడు వుదయం మళ్ళీ బొలారం రైల్వే స్టేషన్‌లో కలిసాం. స్వామినాగం నా చేతిలో ఓ కవరు వుంచి చెప్పాడు.

జ్యోతి

"నిన్న జరిగిన సంఘటన ఆధారంగా కథ రాసాను. చదువుతావా?"

తల వూపి కవరులోంచి స్టేపిల్ చేయబడ్డ ఎనిమిది అరఠావు కాగితాలని బయటకితీసాను.

రైలు వచ్చేలోగా పది నిముషాల్లో చదివేసాను ఆ కథని. అంతా జరిగింది జరిగినట్లుగానే రాసాడు స్వామినాథం. కాని చివరలో ఓ మార్పు చేసాడు. ఆఫీసర్ మమ్మల్ని కోప్పడ్డాడు గదా.

కాని కథలో మాత్రం అలా జరగదు. ఆలస్యానికి కారణం అడుగుతే జరిగింది చెప్తాడు స్వామినాథం. ఆఫీసర్ చాలా సంతోషపడతాడు అది విని. మిగతా స్టాఫ్‌ని పిలిచి జరిగింది చెప్తాడు. చాలామంది తమ అభినందనలు తెలియచేస్తారు స్వామినాథానికి.

"నీ కోరికని ఈ విధంగా కథద్వారా తీర్చుకుంటున్నావా?" అడిగాను నవ్వి.

"ఏం కోరిక?"

"ఆఫీసర్ మెచ్చుకోవడం."

"అది నా కోరిక కాదు. ఎలా వుంది కథ?"

"చాలా మామూలుగా వుంది."

"డల్‌గానా?"

"అది సరయిన పదం. ఏ ఆఫీసరూ నువు రాసిన కథలోలాగా ప్రవర్తించడు. అందులో మనం స్వయంగా అనుభవించాంగా."

నవ్వాడు.

"నిజమే. మన మొరేల్ ఎంత హీనస్థితికి దిగజారిందంటే, కథలో ఏ మనిషయినా మనం వూహించే విధంగా కాక—లేదా మనం ప్రవర్తించే రీతిగా కాక — ఏమాత్రం వున్నతంగా ప్రవర్తించినా ఆ కథ 'అసహజం బావుండ లేదు' అంటాం. ఆఫీసర్ ఎలా ప్రవర్తించాడని కాదు. ఎలా ప్రవర్తించాలి అని ఈ కథలో రాసాను."

స్వామినాథం మాటలు గురించి ఆలోచిస్తుండగా నన్ను ప్రశ్నించాడు.

"చిన్నప్పుడు 'గుడ్ సమారిటన్' పాఠం చదువుకోలేదా? మనకా పాఠం నేర్పడంలోని వుద్దేశం ఏమిటి?"

రైలు రావడంతో నేను బదుల చెప్పకుండా స్వామినాథం చెయ్యి పట్టుకుని అటువైపు నడిచాను. □


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!




ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ______________________
విలాసము: ______________________
______________ PIN ______________

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట మద్రాసు-14